


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510








Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 279 | పేజీలు - 08 | వెల - 05/- | సోమవారం 05-10-2026


# మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం.



- బుర్రిపాలెంలో 3 లక్షల పీఎంఏవై ఇళ్లకు భూమి పూజ
- రాష్ట్రానికి దశలవారీగా 9 లక్షల ఇళ్లు మంజూరు చేస్తామన్న కేంద్రం
- దేశంలోనే తొలిసారిగా 3ఞ ప్రింటింగ్ టెక్నాలజీతో పేదల ఇళ్ల నిర్మాణం
- అమరావతిని క్వాంటం వ్యాలీగా, మెగా సిటీగా అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ



రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా ఎన్డీయే ప్రభుత్వం చారిత్రక ముందడుగు వేసింది. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్ (గ్రామీణ్-+)' కింద మూడు లక్షల ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడిన చంద్రబాబు, 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. పేదవాడికి సొంత ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని, అదొక భద్రత, భవిష్యత్తుకు భరోసా అని ఆయన అభివర్ణించారు.

### కేంద్రం అండ.. 9 లక్షల ఇళ్ల లక్ష్యం

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్ కే కాదు "ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామ" అని ఆప్యాయంగా సంబోధించిన చంద్రబాబు, ఆయన సహకారంతో రాష్ట్రానికి

మిగతా 2లో

# కష్టమైన దశ దాటేశారు.. ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఇక దూకుడే!

- ఎస్ఎల్‌బీసీ పనుల్లో కీలక ముందడుగు
- క్లిష్టమైన షియర్ జోన్‌ను అధిగమించిన కార్మికులు
- సొరంగం పనులు 79 శాతం పూర్తి
- ఐదు నెలల్లో 700 మీటర్ల తవ్వకాలు
- 2028 జూన్ నాటికి నీటి విడుదల లక్ష్యం



ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో కీలక ముందడుగు పడింది. తవ్వకాలకు తీవ్ర ఆటంకంగా మారిన క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాన్ని అధిగమించారు. దీంతో పనుల వేగం పెంచేందుకు మార్గం సుగమమైంది. అదనపు యంత్రాలను అందుబాటులోకి తెచ్చి పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2028 జూన్ నాటికి సొరంగం ద్వారా నీటిని అందించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మూడు జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రి ఆదివారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఎస్-ఎల్‌బీసీ సహా కీలక సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సొరంగం పూర్తయితే కరవు పీడిత ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా నీరు అందనుంది.

మిగతాది 2లో

# రైతుల కష్టాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం: కవిత

- కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్
- రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు.

మిగతాది 2లో

# ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి..

- ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా డ్రోన్ల దాడి
- సుమీ నగరంలోని కుసుమ్ గ్రూప్ ప్లాంట్ దాదాపు ధ్వంసం
- దాడిలో ఒకరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- దాదాపు రూ.400 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా



రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న వేళ, ఉక్రెయిన్‌లోని భారతీయ ఫార్మా కంపెనీపై భీకర దాడి జరిగింది. రష్యా ప్రయోగించిన

2

# ఏపీలో 'తల్లికి వందనం'.. రెండో విడతకు రంగం సిద్ధం

**సుమారు 3.29 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.13,000 జమ**

- ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం.. సీఎంవో అనుమతి కోసం నిరీక్షణ
- వచ్చే వారం లేదా రెండు వారాల్లో నిధులు విడుదలయ్యే అవకాశం
- ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధుల విడుదలకు మార్గం సుగమమైంది.




లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి తుది అనుమతి రావడమే మిగిలి ఉంది. సీఎంవో నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే నిధులను విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విడతలో భాగంగా అర్హులైన సుమారు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 13,000 చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు.



# ఫ్లైదుబాయ్ విమాన ఘటన.. క్యాబిన్ సిబ్బంది పాత్రపై అనుమానాలు!

- దాడి చేసిన వ్యక్తిని విడిచిపెట్టాలని సిబ్బంది కోరడంతో ప్రయాణికుల్లో తీవ్ర అనుమానాలు
- సిబ్బందిని నమ్మని ప్రయాణికులు.. పోలీసులకే అప్పగిస్తామని స్పష్టీకరణ
- ప్రయాణికుల సమయస్ఫూర్తితో విమానం సురక్షితంగా ల్యాండింగ్

దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఊహించని, భయానక ఘటన చోటుచేసుకుంది. విమానాన్ని కూల్చివేసే ఉద్దేశంతో కో-పైలట్, భారతీయ పైలట్‌పై గొడ్డలితో దాడికి పాల్పడగా, ప్రయాణికులు

# ఏపీకి మరో 6 లక్షల ఇళ్లు ఇస్తాం: కేంద్ర




**సీఎం చంద్రబాబు కోరిక మేరకు మరిన్ని ఇళ్లు ఇస్తామని శివరాజ్ సింగ్ హామీ**

- తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో కార్యక్రమం
- 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన
- హాజరైన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, సీఎం చంద్రబాబు
- జగన్ పాలనలో ఏపీ నాశనమైందని, పేదల ఇళ్లను అడ్డుకున్నారని విమర్శ
- చంద్రబాబు విజన్‌తో ఏపీ దేశంలోనే నంబర్ వన్ అవుతుందని ఉద్ఘాటన

ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్త ఆకాంక్షలు నెరవేర్చగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. చంద్రబాబు ఒక డైనమిక్, డెడికేటెడ్, డెసిసివ్ నాయకుడని, ఆయన విజన్‌కు తాను సెల్యూట్ చేస్తున్నానని కొనియాడారు. తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో జరిగిన 3 లక్షల ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా అవతరించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల కలలను సాకారం చేయడానికి చంద్రబాబు నాయకత్వం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.

### టెక్నాలజీతో రాష్ట్రాభివృద్ధికి బాటలు

భవిష్యత్తులో దేశానికి అతిపెద్ద శక్తి టెక్నాలజీయేనని చంద్రబాబు ఎప్పుడో గుర్తించారని శివరాజ్ సింగ్ గుర్తుచేశారు. "ఆయన దూరదృష్టితోనే ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రాన్ని గ్లోబల్ ఐటీ హబ్‌గా ప్రపంచానికి పరిచయం చేశారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటం టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో ఏపీలో కొత్త

మిగతాది 2లో

# జంతర్ మంతర్‌లో వేధింపుల ఆరోపణలు

- జంతర్ మంతర్‌లో ముగ్గురు మహిళా జర్నలిస్టులపై పోలీసుల లైంగిక వేధింపులు
- ఓ ఏసీపీ తనతో అనుచితంగా ప్రవర్తించారని ఓ జర్నలిస్ట్ ఆరోపణ
- ఫిర్యాదులను విచారణ కోసం క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేసిన పోలీసులు
- ఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా
- కేంద్ర హోంమంత్రి సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్



దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం జరిగిన నిరసన కార్యక్రమాన్ని కవర్ చేస్తున్న ముగ్గురు మహిళా జర్నలిస్టులపై పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఢిల్లీ పోలీసులు ఆ ఫిర్యాదులను నిష్పక్షపాత విచారణ కోసం క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.

మిగతాది 2లో

# రైతుల కష్టాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం: కవిత

కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. "నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

# ఏపీకి మరో 6 లక్షల ఇళ్లు ఇస్తాం: కేంద్ర మంత్రి

శివరాజ్ సింగ్ గుర్తుచేశారు. "ఆయన దూరదృష్టితోనే ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రాన్ని గ్లోబల్ ఐటీ హబ్‌గా ప్రపంచానికి పరిచయం చేశారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటం టెక్నాలజీ, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో ఏపీలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారు. అమరావతి అభివృద్ధిపై ఆయన విజన్ చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆయన నిబద్ధత, కఠోర శ్రమతో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఐకాన్‌గా నిలుస్తుంది" అని చౌహాన్ పేర్కొన్నారు.

**జగన్ పాలనలో సర్వనాశనం**

గత ఐదేళ్లలో జగన్ తన విధ్వంసకర వైఖరితో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని చౌహాన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రధాని నరేంద్ర మోదీ పేదల ఇళ్ల కోసం నిధులు పంపితే, జగన్ ప్రభుత్వం తన వాటా ఇవ్వకుండా ఆ పథకాన్ని నీరుగార్చింది. పేదల సొంతింటి కలను చిదిమేసింది. కేంద్రం పంపిన నిధులను దారి మళ్లించి పాపం చేసింది. జగన్‌ను ఏపీ ప్రజలు ఎప్పటికీ క్షమించరు" అని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వం సరిగ్గా పనిచేసి ఉంటే, ఈపాటికే పేదలందరికీ ఇళ్లు ఉండేవని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్రాన్ని రాజధాని లేకుండా వదిలేస్తే, జగన్ మూడు రాజధానుల ఆటతో గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు.

**పేదలందరికీ పక్కా ఇళ్లు.. కేంద్రం భరోసా**

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పేదలందరికీ ఇళ్లు కట్టించాలని సంకల్పించారని శివరాజ్ సింగ్ తెలిపారు. "కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాష్ట్రానికి 76,000 ఇళ్లు మాత్రమే వస్తాయని అధికారులు చెప్పారు. కానీ చంద్రబాబు గారు అందరికీ ఇళ్లు కావాలని, ఇంకా ఎక్కువ కేటాయించాలని ప్రధాని మోదీని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు తొలి విడతగా 3 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఇవాళ బాబు గారు ఇవి కూడా చాలవు, మరో 6 లక్షల ఇళ్లు కావాలని అడిగారు. తప్పకుండా ఇస్తాం. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక, మళ్లీ 3 లక్షలు, ఆ తర్వాత మరో 3 లక్షలు ఇచ్చి రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కలను ప్రధాని మోదీ ఆశీస్సులతో, చంద్రబాబు నాయకత్వంలో నెరవేరుస్తాం" అని హామీ ఇచ్చారు. బుర్రిపాలెంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్లు నిర్మించడం దేశానికే ఆదర్శమని, ఇది సమయాన్ని, ఖర్చును తగ్గిస్తుందని ప్రశంసించారు.

**మోదీ-బాబు నాయకత్వంలో 360 డిగ్రీల అభివృద్ధి**

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చేస్తున్నారని చౌహాన్ అన్నారు. "మోదీ, బాబు అంటే ఒకటి ం ఒకటి = రెండు కాదు.. ఒకటి ం ఒకటి = పదకొండు. వారితో పవన్ కల్యాణ్ కూడా తోడయ్యారు. ఈ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తారు. అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో చట్టం చేశాం. రాష్ట్రానికి రూ. 15,000 కోట్ల ఆర్థిక సహాయం అందించాం. జగన్ సర్కారు పక్కన పెట్టిన పోలవరం ప్రాజెక్టును 100 శాతం కేంద్ర నిధులతో పూర్తి చేస్తాం" అని స్పష్టం చేశారు.

**మహిళలు, రైతుల సంక్షేమానికి పెద్దపీట**

రాష్ట్రంలోని ఏ సోదరి పేదరికంలో ఉండకూడదనే లక్ష్యంతో 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 23 లక్షలుగా ఉన్న లఖ్‌పతి దీదీల సంఖ్యను 60 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే 'సరస్ మేళా'ను తొలిసారిగా ఢిల్లీ నుంచి బయటకు తీసుకొచ్చి, అక్టోబర్ 15న విజయవాడలో నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ఇది మహిళల పాలిట కుంభమేళా అవుతుందన్నారు.

రైతుల కోసం కేంద్రం ఇస్తున్న రూ. 6,000కు అదనంగా, చంద్రబాబు 'అన్నదాత సుఖీభవ' కింద మరో రూ. 14,000 కలిపి మొత్తం రూ. 20,000 అందించి రైతులకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని భరోసా ఇచ్చారు.

"చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఇక సర్వైవింగ్ స్టేట్ కాదు, షైనింగ్ స్టేట్‌గా మారింది. ఆస్పిరేషనల్ ఆంధ్ర, యాంబిషియస్ ఆంధ్ర, ఆసమ్ ఆంధ్రగా రూపుదిద్దుకుంటోంది. ప్రతి ఒక్కరి కలలను నెరవేర్చే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది" అని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తన ప్రసంగాన్ని ముగించారు.

# ఫ్లైదుబాయ్ విమాన ఘటన..
# క్యాబిన్ సిబ్బంది పాత్రపై అనుమానాలు!

. విమానాన్ని కూల్చివేసే ఉద్దేశంతో కో-పైలట్, భారతీయ పైలట్‌పై గొడ్డలితో దాడికి పాల్పడగా, ప్రయాణికులు సాహసోపేతంగా ఆ యత్నాన్ని అడ్డుకున్నారు. అయితే, ఈ ఘటనలో విమాన సిబ్బంది ప్రవర్తన తీవ్ర అనుమానాలకు, కొత్త వివాదానికి దారితీసింది. అసలేం జరిగిందంటే..

ఫ్లైదుబాయ్‌కు చెందిన ఎఫ్ జెడ్ 1073 విమానం టెల్ అవీవ్‌కు బయలుదేరిన కొద్దిసేపటికే కాక్‌పిట్‌లో కలకలం రేగింది. ఒమన్‌కు చెందిన కో-పైలట్ హమామ్ అల్-హమామి, విమానాన్ని నడుపుతున్న భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై క్రాష్ యాక్స్ (విమానంలో ఉండే చిన్న గొడ్డలి)తో దాడికి తెగబడ్డాడు. విమానాన్ని కూల్చేయడమే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడినా, కెప్టెన్ స్మిత్ మచ్చర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి కాక్‌పిట్ డోర్ తెరిచి సిబ్బందిని అప్రమత్తం చేశారు.

ఆయన కేకలు విన్న ప్రయాణికులు వెంటనే స్పందించారు. వారిలో ఉన్న ఇద్దరు ఆఫ్-రోస్టర్ పైలట్లు, మరికొందరు ప్రయాణికులు కలిసి కో-పైలట్ హమామ్‌ను అడ్డుకున్నారు. అతడిని కిందికి పడేసి, ఇయర్‌ఫోన్ వైర్లతో చేతులు కట్టేసి పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ ఘటనలో పట్టుబడిన వారిలో టీవీ షో 'మేదే' చూసిన అనుభవంతో విమానాన్ని స్థిరంగా ఉంచడంలో సహాయపడిన ప్లంబర్ యానివ్ హయున్, గాయపడిన కెప్టెన్‌కు చికిత్స అందించిన దంత వైద్యుడు షోటా ముసేవ్ కూడా ఉన్నారు.

సిబ్బంది పాత్రపై అనుమానాలు

దాడి చేసిన కో-పైలట్‌ను ప్రయాణికులు బంధించిన తర్వాత అసలు నాటకీయత మొదలైంది. 'ది న్యూయార్క్ పోస్ట్' కథనం ప్రకారం, ఫ్లైదుబాయ్ క్యాబిన్ సిబ్బంది ప్రయాణికుల వద్దకు వచ్చి, దాడికి పాల్పడిన హమామ్ అల్-హమామి కట్లు విప్పి అతడిని వదిలివేయమని కోరారు. సిబ్బంది చేసిన ఈ వింత అభ్యర్థనతో ప్రయాణికులు విస్తుపోయారు. వారిపై తీవ్ర అనుమానం పెంచుకున్న ప్రయాణికులు, అందుకు నిరాకరించారు. అతడిని పోలీసులకే అప్పగిస్తామని తేల్చిచెప్పారు.

అంతేకాదు, సిబ్బందిని నమ్మని ప్రయాణికులు.. వారిని కాక్‌పిట్ సమీపంలో ఉండనీయకుండా విమానం మధ్య భాగంలో కూర్చోవాలని ఆదేశించారు. ఇది పరిస్థితి ఎంత ఉద్రిక్తంగా మారిందో తెలియజేస్తుంది. విచారణ కోసం కో-పైలట్ ప్రాణాలతో ఉండటం ముఖ్యమని భావించిన ప్రయాణికులు, అతడికి ఆక్సిజన్ మాస్క్ కూడా అందించారు. దాదాపు గంటా 40 నిమిషాల పాటు అతడిని తమ ఆధీనంలో ఉంచుకొని, విమానాన్ని సురక్షితంగా సమీపంలోని ఓ చిన్న విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు.

మొత్తం 174 మంది ప్రయాణికులు (27 మంది పిల్లలతో సహా) సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ హీరోయిజం, ప్రయాణికుల ధైర్యసాహసాలను అందరూ ప్రశంసిస్తున్నప్పటికీ.. దాడి చేసిన వ్యక్తిని విడిచిపెట్టమని సిబ్బంది ఎందుకు కోరారనేది ఆసక్తికరంగా మారింది. ఈ ఘటనపై దర్యాప్తులో సిబ్బంది పాత్రపై కూడా విచారణ జరిపే అవకాశం ఉంది.

## ఏపీలో 'తల్లికి వందనం'..
# రెండో విడతకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఈ విడతలో భాగంగా అర్హులైన సుమారు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 13,000 చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు, గతంలో సాంకేతిక కారణాలు, ఇతర మార్పుల వల్ల డబ్బులు అందని వారికి కూడా ఈ విడతలో నిధులు అందించనున్నారు. అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌కు ఆర్థిక శాఖ కూడా ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఈ ఫైల్ సీఎంవో వద్ద తుది ఆమోదం కోసం ఉంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అనుమతి లభించిన వెంటనే, ఒకటి రెండు వారాల్లో లేదా వచ్చే వారంలోనే నిధులు జమ అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయ్యిందా లేదా, ఈ-కేవైసీ పూర్తయిందా అనే వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థి, తల్లి ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్సీ కోడ్ వంటివి సరిగ్గా ఉంటే నిధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో జమ అవుతాయని వారు స్పష్టం చేశారు.

# ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి

(మొదటి పేజీ తరువాయి)

రష్యా ప్రయోగించిన డ్రోన్లు సుమీ నగరంలోని 'కుసుమ్ గ్రూప్'కు చెందిన ఫార్మా ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ దాడిలో ప్లాంట్‌లోని ప్రధాన నిర్మాణం దాదాపు పూర్తిగా ధ్వంసమైంది. డ్రోన్లు దాడి చేసిన ప్రాంతం నుంచి భారీగా పొగ కమ్ముకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ దాడి వల్ల సుమారు రూ.400 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. విశేషమేమిటంటే.. రెండేళ్లకు పైగా యుద్ధం జరుగుతున్నప్పటికీ, ఈ ప్లాంట్ నిరంతరాయంగా ఉత్పత్తిని కొనసాగిస్తూనే ఉంది. తాజా దాడితో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. భారతీయుడైన రాజీవ్ గుప్తా నేతృత్వంలో కుసుమ్ గ్రూప్ నడుస్తోంది. ఈ సంస్థ 1994లో భారతీయ ఔషధాలను ఉక్రెయిన్‌కు ఎగుమతి చేసే డిస్ట్రిబ్యూటర్‌గా ప్రారంభమై, ఆ తర్వాత సొంత బ్రాండ్లను మార్కెటింగ్ చేసింది. 2009లో సుమీ నగరంలో తయారీ ప్లాంట్‌ను స్థాపించింది. ఈ గ్రూప్ ఉక్రెయిన్, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ వంటి 9కి పైగా దేశాలకు 50 రకాల జనరిక్ ఔషధాలను విక్రయిస్తోంది. గత కొంతకాలంగా రష్యా.. చవకైన, వేగవంతమైన షాహెద్ డ్రోన్లతో ఉక్రెయిన్‌పై నిరంతరం దాడులు చేస్తోంది. ఈ డ్రోన్లను అడ్డుకోవడం ఉక్రెయిన్ వాయు రక్షణ వ్యవస్థలకు సవాలుగా మారింది. ఇదే సమయంలో, ఉక్రెయిన్ కూడా దేశీయంగా తయారుచేసిన 'ఎఫ్‌పీ-7' బాలిస్టిక్ క్షిపణిని ఈ వారంలో తొలిసారిగా ప్రయోగించినట్లు ప్రకటించింది. దీని పరిధి సుమారు 250 కిలోమీటర్లు కావడం గమనార్హం.

# జంతర్ మంతర్‌లో వేధింపుల ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల సందర్భంగా ఈ ఘటన జరిగింది. బాధితురాళ్లలో ఒకరైన మహిళా జర్నలిస్ట్, ఓ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) తనతో అనుచితంగా ప్రవర్తించారని, లైంగికంగా వేధించారని ఆరోపించారు. తాను పోలీసుల చర్యలను వీడియో తీస్తుండగా, ఆ అధికారి తనను అసభ్యంగా తాకి పక్కకు నెట్టేశారని



ఆమె వాపోయారు. ఘటన అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, వెంటనే కేసు నమోదు చేయడానికి నిరాకరించారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై 'ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' (పీసీఐ) తీవ్ర దిగ్భ్రాంతి, ఆందోళన వ్యక్తం చేసింది. "ప్రజాస్వామ్యంలో ఇలాంటి ప్రవర్తనను సాధారణ విషయంగా పరిగణించలేం. జర్నలిస్టులు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించేలా చూడాలి. దేశ రాజధాని నడిబొడ్డున ఇలాంటి ఘటనలు జరగడం మీడియా స్వేచ్ఛకు మంచిది కాదు" అని పీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. మహిళా జర్నలిస్ట్ ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, మీడియా ప్రతినిధులు బెదిరింపులు లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేసింది. రాహుల్ గాంధీ ఘాటు స్పందన ఈ వ్యవహారంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోకి వస్తారని, కాబట్టి దీనికి కేంద్ర హోంమంత్రి అమిత్ షానే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "ఒక మహిళా జర్నలిస్ట్ పోలీస్ అధికారిపై ఆరోపణలు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనే డిమాండ్‌తో వందలాది మంది జర్నలిస్టులు గంటల తరబడి అక్కడే కూర్చున్నారు. కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దారుణం" అని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. "ఒక మహిళ ఫిర్యాదును నమోదు చేయడానికి కూడా భయపడే ప్రభుత్వం దేనిని కాపాడుతోంది? అమిత్ షా గారూ, మీరెక్కడున్నారు? దీనికి మీరే సమాధానం చెప్పాలి" అని రాహుల్ సూటిగా ప్రశ్నించారు.

# మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్ కే కాదు "ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామ" అని ఆప్యాయంగా సంబోధించిన చంద్రబాబు, ఆయన సహకారంతో రాష్ట్రానికి భారీగా గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. తాను అడిగిన వెంటనే 3 లక్షల ఇళ్లను మంజూరు చేశారని, మరో మూడు, నాలుగు నెలల్లో ఇంకో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో 3 లక్షల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారని, మొత్తం 9 లక్షల ఇళ్లను రాష్ట్రానికి అందించనున్నారని వెల్లడించారు.

మధ్యప్రదేశ్‌లో నదుల అనుసంధానం వంటి గొప్ప పనులతో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రజల గుండెల్లో నిలిచారని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లను నిర్మించిందని గుర్తుచేశారు.

**దేశంలోనే తొలిసారిగా 3డి ప్రింటింగ్ టెక్నాలజీ**

ఈ కార్యక్రమంలో భాగంగా, దేశంలోనే తొలిసారిగా పేదల గృహ నిర్మాణంలో "3డి కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ"ని వినియోగిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రయోగాత్మకంగా బుర్రిపాలెంలో 170 ఇళ్లను ఈ నూతన సాంకేతికతతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ టెక్నాలజీతో నిర్మించిన ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే లోపల 8 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, తద్వారా ఏసీ అవసరం లేకుండానే చల్లదనం లభిస్తుందని శాస్త్రవేత్తలు చెప్పినట్లు వివరించారు.

కేవలం మూడు నెలల్లోనే ఇంటి నిర్మాణం పూర్తికావడం, వర్షాలకు తేమ చేరకపోవడం, లీకేజీలు ఉండకపోవడం వంటి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా మరో 5,000 ఇళ్లు ఇదే విధానంలో నిర్మించి, బుర్రిపాలెం ఆదర్శాన్ని జాతీయ విధానంగా మార్చేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని చంద్రబాబు ఆరోపించారు. పేదల కోసం గతంలో తమ ప్రభుత్వం మంజూరు చేసిన 17 లక్షల ఇళ్లలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, గృహ నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని విమర్శించారు. చెరువులు, కొండలు, గుట్టల్లో నివాసయోగ్యం కాని స్థలాలను కేటాయించడంతో 4 లక్షల మంది లబ్ధిదారులు వాటిని తిరస్కరించారని గుర్తుచేశారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, పట్టాదారు పాసుపుస్తకాలపై గత ముఖ్యమంత్రి ఫొటోను తొలగించి రాజముద్రతో కొత్త పట్టాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి భూముల రీసర్వే పూర్తి చేసి, భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

**అభివృద్ధి, సంక్షేమమే అజెండా**

కూటమి ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా రాత్రింబవళ్లు పనిచేస్తామని చంద్రబాబు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం వంటివి ఇప్పటికే అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి, ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాను ఆదుకున్నామని, ఈ ఏడాది కూడా 60 టీఎంసీల గోదావరి జలాలను తరలించామని వివరించారు.



**అమరావతి.. భవిష్యత్ మెగా సిటీ**

అమరావతి కేవలం రాజధాని కాదని, అదొక మెగా సిటీగా రూపుదిద్దుకుంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాలు కలిసిపోయి అంతర్జాతీయ స్థాయి నగరం ఆవిర్భవిస్తుందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న అమరావతిలో "క్వాంటం వ్యాలీ"కి శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఇతర కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పల్లె వెలుగు
మా కలం - సామాన్యుడి బలం
సోమవారం 05-10-2026


# బనగానపల్లెను అభివృద్ధిలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం-మంత్రి బీసీ





బనగానపల్లె అక్టోబర్ 4,పల్లెవెలుగు బనగానపల్లెను అభివృద్ధిలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్డీవో కార్యాలయం, డ్రైనేజీ, బైపాస్ రోడ్డు పనులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా కొనసాగుతున్న వివిధ పనులను పరిశీలించిన మంత్రి, పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో కార్యాలయ భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సౌకర్యవంతంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వర్షాల సమయంలో నీరు నిలిచిపోవడం, మురుగునీటి సమస్యలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థను సమర్థవంతంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలో పెరుగుతున్న వాహన రాకపోకలు, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు బైపాస్ రోడ్డు కీలకంగా ఉంటుందని తెలిపారు. పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, ఎలాంటి జాప్యం లేకుండా నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బనగానపల్లె పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసి, మౌలిక వసతుల కల్పనలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి బీసీ తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడంతో పాటు, పట్టణంలో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ నాగ శ్రీనివాసులు, ఆర్ అండ్ బి ఎస్ సి శ్రీధర్ రెడ్డి, ఏఈ హుస్సేని, గ్రామపంచాయతీ ఈవో మురళీమోహన్, పట్టణ మాజీ ఉపసర్పంచ్ బురానుద్దీన్, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# మోకాళ్లపై నిలబడి వీఆర్ఏల వినూత్న నిరసన

బనగానపల్లె, అక్టోబర్ 4, పల్లెవెలుగు పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా వీఆర్ఏలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 19వ రోజుకు చేరుకున్నాయి ఆదివారం



తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా వీఆర్ఏలు మోకాళ్లపై నిలబడి విన్ను తన నిరసన వ్యక్తం చేశారు. వీఆర్ఏ లు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సహాయ నిరాకరణ ఉద్యమం 19వ రోజుకు చేరుకుంది. వీఆర్ఏలు తమ దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తరహాలో వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారందరికీ ఒకేసారి ఉద్యోగ నియామకాలు కల్పించాలని, అర్హులైన వీఆర్ఏలకు 70 శాతం ప్రమోషన్లు కల్పించాలని, మరణించిన వీఆర్ఏల కుటుంబ సభ్యులకు వయోపరిమితి లేకుండా ఉద్యోగాలు కల్పించాలని కోరారు. 19 రోజులుగా వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన రాకపోవడంపై వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం అధ్యక్షులు తలారి బాలుడు నాయకులు హరిబాబు, సుబ్రహ్మణ్యం, వీఆర్ఏలు పాల్గొన్నారు.

# మద్దయ్య యాదవ్ ను సన్మానించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, అక్టోబర్ 4, పల్లెవెలుగు బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు



కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన జి మద్దయ్య యాదవ్ ను రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నంద్యాల జిల్లాకు మొదటిసారిగా బనగానపల్లెకు చెందిన జి.మద్దయ్య యాదవ్ జిల్లా అధ్యక్షులుగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు జి. నరసింహారెడ్డి ,జిల్లా సహాయ కార్యదర్శి ఎం. రామచంద్రారెడ్డి, ఏపీ బీజేపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్ , ఉపాధ్యక్షులుగా ఎస్ షాషావలి, బనగానపల్లె మండల అధ్యక్షులు చంద్రశేఖర్ ఉపాధ్యక్షులు మధు, వై.రఘురామిరెడ్డి, నాయకులు ఓబులేసు, నగేష్ ,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కల్లూరు అర్బన్-2 మండల కమిటీ సమావేశం

**--పార్టీ పటిష్టతే ధ్యేయంగా పనిచేయాలి: మండల అధ్యక్షుడు ఉలిందకొండ రవి పిలుపు-- హాజరైన జిల్లా, మండల స్థాయి ముఖ్య నాయకులు**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కల్లూరు అర్బన్-2 పరిధిలోని అమ్మ హాస్పిటల్ మెయిన్ రోడ్డు వద్ద గల లిబర్టీ టైలర్ షాప్ ప్రాంగణంలో మండల కమిటీ సమావేశం ఆదివారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి కల్లూరు అర్బన్-2 మండల అధ్యక్షుడు ఉలిందకొండ రవి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఉలిందకొండ రవి మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని, మండల పరిధిలోని ప్రతి గడపకూ పార్టీ విధానాలను, సంక్షేమ కార్యక్రమాలను చేరవేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి కమిటీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న జిల్లా కార్యవర్గ సభ్యులు కె. రవితేజ మాట్లాడుతూ... కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో మండల జనరల్ సెక్రటరీ యుగేందర్, మండల సెక్రటరీలు శివలింగం, మద్దూరు అశోక్, నాయకులు మహమ్మద్ యూనిస్, మధులతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# గ్రూపు రాజకీయాలతో పార్టీ మనుగడ ప్రశ్నార్థకం

- గ్రామాలలో టిడిపికి వ్యతిరేక పవనాలు
- రంగంలోకి దిగిన పార్టీ పరిశీలకుడు





బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 4: బండి ఆత్మకూరు మండలంలో కొన్ని గ్రామాలలో తెలుగుదేశం పార్టీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయా? అన్నది ప్రస్తుతం గ్రామాలలో చర్చలకు దారి తీస్తూ ఉంది. మరికొద్ది రోజులలో స్థానిక సంస్థలు జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం పరిస్థితులు ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయోనని పరిశీలకులు అంచనాలు వేసుకుంటున్నారు. మండలంలోని బండి ఆత్మకూరు సంత జుటూరు రామాపురం సింగవరం, బి.కోడూరు, కడమల కాల్వ , ఎర్రగుంట్ల రామాపురం పార్నపల్లె, గ్రామాలలో తెలుగుదేశం పార్టీకి అనుకూలమైన పరిస్థితులు లేవన్నది బహిరంగ రహస్యం. ఈ పరిస్థితులన్నీ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ టీం ద్వారా నిర్వహించిన సర్వేలో వెల్లడి అయినట్లుగా వెలుగులోకి వచ్చింది. ఈ పరిస్థితులను చక్కదిద్దడానికి శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు భాస్కర్ శనివారం రాత్రి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశం ఇందుకు సాక్షి భూతంగా నిలుస్తూ ఉంది. అయితే పార్టీ పరిశీలకుడు పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లుగా కొందరికి మాత్రమే సమాచారం అందింది. మిగతా వారికి ఈ విషయంపై సమాచారం అందజేయకపోవడంతో మండలంలో గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి అనే విషయానికి సాక్ష్యంగా నిలుస్తూ ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో శ్రీశైలం నియోజకవర్గం అభ్యర్థి బుడ్డ రాజశేఖర్ రెడ్డి విజయం కొరకు కార్యకర్తలందరూ కృషి చేయడం జరిగింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కార్యకర్తలందరికీ న్యాయం చేయాలని ఉద్దేశంతో, ప్రతి గ్రామంలోనూ రోడ్ల అభివృద్ధికి, డ్రైనేజీ నిర్మాణాలకు గాను కోట్లాది రూపాయలను కేటాయించడం జరిగింది. ఈ నిధులను కేటాయించడంలో చిన్న స్థాయి కార్యకర్తలకు అన్యాయం జరిగిందన్న ఉద్దేశంతో చాలామంది కార్యకర్తలు మౌనంగా ఉంటూ వస్తున్నారు. ఎన్నికల తర్వాత పార్టీ అధ్యక్ష పదవి విషయంలో ఏకపక్ష నిర్ణయం జరిగిందన్న విషయం కూడా అప్పట్లోనే చర్చకు దారి తీసింది. ఇలాంటి పరిస్థితులలోనే గ్రామాలలో వర్గాలు ఏర్పడేందుకు పునాదులు ఏర్పడ్డాయి. తర్వాత చాలామందికి ఎమ్మెల్యే నామినేటెడ్ పదవులు కట్టపెట్టడం జరిగింది. నామినేటెడ్ పదవులు పొందిన వారంతా గ్రామాలలో పెత్తనాలు చేయకుండా పార్టీ అభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలని ఎమ్మెల్యే బుడ్డా అప్పట్లోనే చాలాసార్లు హితోపదేశం చేశారు. చాలామంది నాయకులు ఈ విషయాన్ని పక్కనపెట్టి, తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసమే పనులు చేసుకుంటూ వచ్చారు. గ్రామాలలోని కొన్ని చెరువులలో మట్టిని త్రవ్వకొని అమ్ముకునే విషయంలో కూడా రాజకీయ మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. మట్టిని అమ్ముకునే విషయంలో అధికారులకు సైతం డబ్బులు ఇవ్వాలన్న ఉద్దేశంతో కొందరు నాయకులు అధికారుల పేరు చెప్పి డబ్బులు వసూలు చేసిన సంఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయి . ఈ విషయం కొందరు అధికారుల దృష్టికి వెళ్లడంతో ఈ సంఘటనపై వారు సైతం నాయకుల పై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటనలు కూడా జరిగాయి. గత ఏడాది ఖరీఫ్ రబీ సీజన్లలో యూరియా పంపిణీ విషయం కూడా చర్చకు దారి తీసింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న వారికి అధికార యంత్రాంగం వత్తాసు పలకడం సబబే అయినప్పటికీ, కూటమి ప్రభుత్వంలో కొందరు నాయకుల పరిస్థితి ఇందులో శృతి మించిపోయింది. తాను చెప్పినవారికి ఎరువుల మందులు ఎత్తి తీరాల్సిందేనట్టు హుకూంలు జారీ చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. చాలామంది నాయకులు అధిక సంఖ్యలో ఎరువుల మందులను తీసుకెళ్లి బ్లాక్ మార్కెట్లో అమ్ముకున్న విమర్శలు కూడా వినిపించాయి.

ఈ విషయంలో నాయకుల ఒత్తిడిలకు తాళలేక గ్రామ వ్యవసాయ సహాయకులు ముకుమ్మడిగా సెలవులోకి వెళ్లిపోవాలని నిర్ణయించుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. యూరియా పంపిణీ విషయంలో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ తమకు సైతం మందులు సక్రమంగా అందలేదని ఆ పార్టీ నాయకులే అసంతృప్తి వెళ్ళగక్కిన సందర్భాలు కూడా ఉన్నాయి. చెరువులలో మట్టి తోలుకునే విషయంలో సొంత గ్రామస్తుల పొలాలకు మట్టి ఇవ్వకుండా ఇతర గ్రామ నాయకులకు మట్టిని అమ్ముకున్నారన్న విషయం కూడా అప్పట్లోనే భగ్గుమంది. ఈ విషయం క్రింది స్థాయి కార్యకర్తలకు మింగుడు పడని విషయంగా మారింది. పార్టీ కోసం తాము అహర్నిశలు పనిచేస్తున్నప్పటికీ, తమకు ఎలాంటి గుర్తింపు లేదని గ్రామాలలో బూతు కన్వీనర్లు వెళ్లగకుతున్నారు. తమను కాదని పార్టీ అభివృద్ధి కొరకు ఏమాత్రం పనిచేయని నాయకులకు లక్షల పనులను కేటాయిస్తున్న విషయం కార్యకర్తలకు మింగుడు పడని విషయంగా మారింది. దీంతో పార్టీ పట్ల కార్యకర్తలలో అసంతృప్తి జ్వాలలు రగులుకుంటూ వస్తున్నాయి. గ్రామాలలో ఏర్పడిన వర్గ విభేదాలు ఘటనలు పార్టీ అధిష్టా...

# దేశం గర్వించదగ్గ నాయకుడు నరేంద్ర మోడీ... శివకృష్ణ యాదవ్

బనగానపల్లె, అక్టోబర్ 4,పల్లెవెలుగు ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా



బనగానపల్లె పట్టణం లోని ఎంపీడీవో కార్యాలయం లోని పొదుపు భవనం నందు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బీజేపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో సామాజిక సేవ పట్ల చైతన్యం కల్పించాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు. ఈ రక్తదాన శిబిరంలో బనగానపల్లె నియోజకవర్గం బిజెపి నాయకులు,కార్యకర్తలు,నరేంద్ర మోడీ అభిమానులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం జరిగింది. భారతదేశం గర్వించదగ్గ ఏకైక నాయకుడు ప్రధానమంత్రి మోడీ అని అన్నారు. బీజేపీ పార్టీ కేంద్రంలో మరో 25 సంవత్సరాలు కొనసాగితే భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే,పర్యావరణ పరిరక్షణ,పరిశుభ్రత పెంపొందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను కూడా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బిజెపి మండల అధ్యక్షులు యాదగిరి,హరికృష్ణ గౌడ్, రామసుబ్బయ్య,చిన్న పెద్దన్న,లోకేశ్వర రెడ్డి, అర్బన్ ఇంచార్జ్ పత్తి నాగమోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు సుధాకర్,శివరామిరెడ్డి, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు షేక్.చాందిని, లీగల్ సెల్ అడ్వకేట్ జగన్నాథం రెడ్డి, బనగానపల్లె మండల రూరల్ మరియు పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వివాహ వేడుక కు హాజరై వధూవరులను ఆశీర్వదించిన బీసీ ఇందిరా రెడ్డి



బనగానపల్లె అక్టోబర్ 4,పల్లెవెలుగు పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ప్రాంతానికి చెందిన శ్రీ షేక్ చిన్న అబ్దుల్లా ఆహ్వానం మేరకు వారి స్వగృహంలో నిర్వహించిన కుమార్తె వివాహ వేడుకకు హాజరై, దుల్హా, దుల్హన్ లను ఆశీర్వదించిన శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి .

## మేన్స్ వేర్ షాపు ను ప్రాంభించిన బీసీ ఇందిరా రెడ్డి



బనగానపల్లె, అక్టోబర్ 4,పల్లెవెలుగు మండలం లోని ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన చిదిగే కిరణ్, చిదిగే శ్రీశాంత్ ల ఆహ్వానం మేరకు బనగానపల్లె పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ౨.జ.దీ మెన్స్ వేర్ షాప్ ను ప్రారంభించిన శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

## విద్యా కమిటీ చైర్మన్లుగా ఎన్నికైన నాయకుల సందడి.

**ఉమాపతి నాయుడును కలిసిన నాగనాథనహళ్లి, హనవాళ్లు గ్రామ నాయకులు.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నియోజకవర్గంలోని నాగనాథనహళ్లి, హనవాళ్లు గ్రామాల్లో




నూతనంగా విద్యా కమిటీ చైర్మన్లుగా ఎన్నికైన సందర్భంగా గ్రామ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొంకా ఉమాపతి నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన విద్యా కమిటీ ఎన్నికల వివరాలను ఉమాపతి నాయుడుకు నాయకులు వివరించారు. నూతనంగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్లు, సభ్యులు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అలాగే తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలని ఉమాపతి నాయుడు సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగనాథనహళ్లి, హనవాళ్లు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**-శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు,,,,**

నందవరం పల్లె వెలుగు అక్టోబర్ 4 నందవరం మండల పరిధిలోని ముగతి గ్రామంలో



టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి ఎమ్మిగనూరు విజన్ కంటి వైద్యశాల అప్టోమెట్రిస్ట్ అనిషా తమ సిబ్బందితో హాజరైయ్యారు. ఈ శిబిరానికి వచ్చిన రోగులకు కంటి పరీక్షలు చేసి వారికి ముందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి ఆదరణ లభించిందని సేవా దృక్పథంతో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి వివిధ రకాల టెస్టులను ఉచితంగానే నిర్వహించి అవసరం అయినా వారికి కర్నూల్ లోని సుశీల నేత్రాలయంలో కంటి ఆపరేషన్ నులు చేస్తామన్నారు. అనంతరం బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం కాలంలో కంటి సమస్యలు ప్రతి ఒక్కరిని ఇబ్బదులకు గురి చేస్తోందని కాబట్టి ఇలాంటి ఉచిత కంటి వైద్య శిబిరాలను సంద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు సంఘం అధ్యక్షులు కొండారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ కడుబూరి, వెంకటేష్ గౌడ్, సురేష్ గౌడ్, మోహన్, అర్జున్ గ్రామ నాయకులు, ప్రజలు, హాస్పిటల్ నిర్వాహకులు రవితేజ, సహాయకులు నాగరాజు, ఆశీర్వాదం లు పాల్గొన్నారు.

## హుస్సేనాపురంలో రూ. 1.50 కోట్లతో నిర్మించిన 'షాదీఖానా' ప్రారంభం

**మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్**





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో మైనార్టీల సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందని పాణ్యం శాసనసభ్యురాలు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని హుస్సేనాపురం గ్రామంలో రూ. 1.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 'నారావారి షాదీఖానా'ను రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్.ఎం.డి. ఫరూక్, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్‌లతో కలిసి ఆమె ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలు తమ శుభకార్యాలు, వివాహాలను ఘనంగా నిర్వహించుకునేందుకు ఈ షాదీఖానా ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ భవనాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని ఓర్వకల్లు, నన్నూరు గ్రామాల్లోనూ షాదీఖానాల నిర్మాణానికి సంబంధించి వెంటనే అధికారులు అంచనాలు (ఎస్టిమేట్లు) సిద్ధం చేసి పంపాలని, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. హుస్సేనాపురం గ్రామంలో మసీదు నిర్మాణం, పునర్నిర్మాణ పనులకు కూడా తగిన ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సామాజిక, ఆర్థిక ఉన్నతి కోసం ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓ యువతా మాట కాదు మార్గం చూడు!!

పల్లె వెలుగు:"గొప్ప పనులు మాటలతో కాదు' నిశ్శబ్దంగా చేసే చేతలతోనే?సాధించబడతాయి" బిమహాత్మాగాంధీ.

కేవలం మాటలు చెప్పడం సులువు కానీ ఆ మాటలను చేతుల్లో చూపించినప్పుడే మనిషికి నిజమైన గుర్తింపు గొప్పతనం లభిస్తాయి. సమాజంలో శాశ్వతంగా నిలిచిపోయేది మన పనులు కానీ మనం పలికే ఉత్తమ పదాలు కావు. మాటలు కోటలు దాటుతాయికానీ అడుగులు గడపైనా దాటవు పలికే పదాలు అందంగా ఉండొచ్చు కాని చేసే పనులే చరిత్రను మారుస్తాయి. చిలుక పలుకులు ఎన్నైనా చెప్పొచ్చు కానీ గమ్యం చేరేది రెక్కల కష్టంతోనే ఆకాశాన్ని చూపిస్తూ మురిపించడం కాదు. నేలపై నిలబడి గెలవడమే నిజమైన గమ్యం భాషణలు చేయడం చాలా సులువు

ఆచరణ పెట్టడమే అసలైన గెలుపు శబ్దాల వేగం కంటే శ్రమించే చేతుల వేగమే మిన్న కలలు కనడం మొదటి అడుగైతె కష్టపడడమే గమ్యానికి రహదారి



కాలం ఎవరికోసం ఆగదు సోదరా మాటలు ఆపి నీ పనిని మొదలు పెట్టు ప్రగల్బాలు కాదు ఫలితాలు ముఖ్యం ఫలితాలే నీప్రఖ్యాతి చేసే ప్రతి పనిలో శ్రద్ధ ఉంటే విజయం నీ నీడలా మారుతుంది. నీ మాటలు నిన్ను గొప్పవాడిని చేయవునీచేతలే సమాజంలో నీకు గౌరవం తెస్తాయి. మాటల వెనుక దాక్కోకు సోదరా? చేతలతో నీ సత్తా చాటుకో ప్రపంచం నీ మాటలు మర్చిపోవచ్చు కానీ నువ్వు సృష్టించిన అద్భుతాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. నువ్వు ప్రపంచాన్ని మార్చాలనుకుంటే మొదటఆ మార్పును నీచేతల్లో చూపించు బిస్వామి వివేకానంద.

మాటల ఆర్భాటం తాత్కాలికం. కానీ చేతల ప్రభావం శాశ్వతం. విమర్శలుపొగడ్తలతో పని లేకుండా నిశ్శబ్దంగా మన పనినీ మనం చేసుకుంటూ పోయినప్పుడే విజయం మనల్ని వెతుకుతూ వస్తుంది .మాటలు తగ్గించి చేతలు పెంచడమే యువత ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఏకైక మార్గం. నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం రచయిత కాలమిస్ట్ కరీంనగర్.

# ఎస్సీ హాస్టల్ సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి.

**● ఖాళీ ప్లేట్లతో ఆర్డీవో కార్యాలయం ముందు విద్యార్థుల ధర్నా. ●**

**వార్డెన్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ.**






ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలోని ఎస్సీ నంబర్--1 హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదివారం ఆర్డీవో కార్యాలయం ముందు ఖాళీ ప్లేట్లతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో భోజనం, పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. "మాకు అన్నం పెట్టలేని వార్డెన్ మాకొద్దు.. వెంటనే సస్పెండ్ చేయాలి" అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు అందించాల్సిన నాణ్యమైన పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదని వారు ఆరోపించారు. అనేక సందర్భాల్లో భోజనం అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు అందాల్సిన గుడ్లు, బియ్యం, ఇతర సరుకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతోనే ఖాళీ ప్లేట్లతో నిరసన చేపట్టాల్సి వచ్చిందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, తగిన వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులకు భోజనం, పౌష్టికాహారం సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్టల్ నిర్వహణపై వచ్చిన ఆరోపణలపై తక్షణమే విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌కు సరఫరా అవుతున్న గుడ్లు, బియ్యం, ఇతర సరుకులు పక్కదారి పట్టకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు సంజయ్, కార్యదర్శి శశిధర్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్, వెంకటేశులు, ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్, ఉత్తేజ్, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు. అభినందనలతో ఎస్ఎఫ్ఐ ఆదోని పట్టణ కమిటీ

# రహదారులపై గుంతలు తవ్వితే కఠిన చర్యలు

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : నగరంలో వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేసేటప్పుడు రహదారులకు నష్టం కలగకుండా కాంక్రీట్ స్టాండ్లను మాత్రమే ఉపయోగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. రహదారులపై



కర్నూలు గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా అవసరాల కోసం నిర్మించిన రహదారులను శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల పేరుతో దెబ్బతీయడం సరికాదన్నారు. షామియానాల ఏర్పాటుకు రహదారులకు నష్టం కలగని ప్రత్యామ్నాయ పద్ధతులను మాత్రమే వినియోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ చట్టం, 1994 ప్రకారం జరిమానాలు విధిస్తామని తెలిపారు. రహదారులకు నష్టం కలిగించే కార్యక్రమాలను అడ్డుకునేందుకు మున్సిపల్ యంత్రాంగం క్షేత్రస్థాయిలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు.

# బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఖబడ్దార్.

**☛బీసీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి.**

**☛జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో నాయకులు.**

ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన బీసీ నాయకుల ఆధ్వర్యంలో డోన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లపై సమావేశంలో నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు అన్ని బీసీ వర్గాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ బీసీలకు అండగా నిలుస్తూ, రాజకీయాల్లో వారికి ప్రాధాన్యత కల్పించిందని నాయకులు పేర్కొన్నారు. దివంగత నందమూరి తారక రామారావు బీసీ వర్గాలను గుర్తించి రాజకీయంగా ఎదిగేందుకు పెద్దఎత్తున అవకాశాలు కల్పించారని కొనియాడారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగడంలో ఎన్టీఆర్ కీలక పాత్ర పోషించారని అన్నారు. అదేవిధంగా 2019 తర్వాత బీసీ రిజర్వేషన్ల విషయంలో వైసీపీ




ప్రభుత్వం అన్యాయం చేసిందని నాయకులు ఆరోపించారు. గతంలో 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లు తగ్గించడంతో బీసీలకు నష్టం జరిగిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తే, వైసీపీ నాయకులు అడ్డుపడుతున్నారని వారు ఆరోపించారు. బీసీల హక్కులు, రిజర్వేషన్ల విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని బీసీ సంఘాలు, నాయకులు ఐక్యంగా పోరాడాలని సమావేశంలో పిలుపునిచ్చారు. బీసీలకు అన్యాయం చేసే ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజల ముందు సమాధానం చెప్పాల్సి ఉంటుందని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డితో పాటు బీసీ కార్పొరేషన్ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన బీసీ సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# కీసర తహసీల్దార్ కార్యాలయంలో ప్రవేట్ దళారుల హల్చల్ ?

**● కార్యాలయానికి వచ్చే వారికి టోకరా ! ● ప్రతి పనికో రేటు ! ● అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందా అనే అనుమానాలు ? ● దళారులను నమ్మి మోసమోతున్న సామాన్య ప్రజలు ● ప్రజలపై ఆర్థిక భారం,**

కీసర : ప్రభుత్వ కార్యాలయం అంటే ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించే కార్యాలయం. కానీ కీసర తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తి పేరుతో వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తి వసూళ్లకు పాల్పడుతూతున్నట్లు సమాచారం. రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తదితర ప్రభుత్వ సేవలకు సంబంధించి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రేషన్ కార్డుకు రూ.2,000, కుల ధ్రువీకరణ పత్రానికి రూ.500 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ?

**ప్రభుత్వ సేవలకు దళారులకు డబ్బులు ఎందుకు**

ప్రభుత్వం ప్రజలకు అందించే అనేక సేవలకు నిర్ణీత విధానాలు, రుసుములు ఉంటాయి. అలాంటి సేవల పేరుతో ప్రైవేట్ వ్యక్తులు అదనపు మొత్తాలు వసూలు చేస్తే వాటిపై ప్రజలు ప్రశ్నించాల్సిన ఆరోపణలపై సంబంధిత అధికారులు



అవసరం ఉంది. వీటి వెనుక అధికారుల హస్తం ఉన్నదా అనే కోణంలో దర్యాప్తు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు

ప్రభుత్వ కార్యాలయం వద్ద ప్రైవేట్ వ్యక్తికి డబ్బులు చెల్లించే ముందు ఆ డబ్బు ఎందుకు? అధికారిక రుసుమా? రసీదు ఇస్తారా? అని ప్రజలు తెలుసుకోవాలి.

**దళారులకు అడ్డుకట్ట పడేదెప్పుడు ?**

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు నేరుగా సేవలు అందేలా వ్యవస్థ ఉన్నప్పటికీ, మధ్యవర్తుల ప్రమేయం పెరిగితే సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం లేకపోలేదు. ఈ పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ప్రభుత్వ సేవలు ప్రజల హక్కు..**

వసూళ్ల ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న కార్యాలయానికి వచ్చే ప్రజలు... దళారులకు అడ్డుకట్ట వేయాలని , ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు నేరుగా అధికారుల సేవలందేలా చూడాలని కోరుతున్న ప్రజలు......కొందరు దళారుల వల్ల ప్రభుత్వ కార్యాలయాలకు మాయని మచ్చల తయారవుతుందని అంటున్నారు....

# కల్లెకుంట రఘునాథ రెడ్డితో బుట్టా శివ నీలకంఠ

ఎమ్మిగనూరు, పల్లె వెలుగు అక్టోబర్ 04



ఎమ్మిగనూరు పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో కల్లెకుంట రఘునాథ రెడ్డి తో బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠ ఆదివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు ఆత్మీయంగా పలకరించుకుని, పరస్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలు, స్థానిక పరిస్థితులు, ప్రజా సమస్యలు తదితర అంశాలపై ఇరువురు పరస్పరం చర్చించుకున్నారు. రాజకీయ, సామాజిక పరిణామాలపై కూడా అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిసింది. ఆత్మీయ వాతావరణంలో సాగిన ఈ భేటీకి పలువురు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.ఆర్. రామకోటేశ్వర్ రెడ్డి నందవరం మండల కన్వీనర్ జె. శివారెడ్డి గౌడ్ ఎమ్మిగనూరు పట్టణ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ డి. నజీర్ అహమ్మద్ , ఎమ్మిగనూరు టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ యుకె రాజశేఖర్ సాంస్కృతిక విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎర్రబాడు కాశిరెడ్డి 15వ వార్డు ఇంచార్జ్ సయ్యద్ ఫయాజ్ ఎమ్మిగనూరు మండల కార్యదర్శి తిమ్మాపురం బోయ బజారి గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కడివేళ్ల ఉరుకుందు గౌడ్ కడిమెట్ల నాగార్జున రెడ్డి కడివేళ్ల రాజశేఖర్ రెడ్డి తిమ్మాపురం గ్రామ మాజీ విద్యా కమిటీ చైర్మన్ వీరాంజనేయులు నేరుడుప్పల ఉసేనీ, నేరుడుప్పల జనార్దన్, నేరుడుప్పల పవన్, కోటేకల్ నరసన్న, కోటేకల్ పాపన్న, కోటేకల్ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బనగానపల్లె, అక్టోబర్ 4, పల్లెవెలుగు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1993 -95 బ్యాచ్ కి చెందిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది . ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1993--95 ఇంటర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాకి 31 సంవత్సరాలు తర్వాత కలుసుకొని ఏరా ఎలాగున్నావ్.. ఎన్నాళ్లయిందో మిమ్మల్ని చూసి. ఇంట్లో అందరూ బాగున్నారా అంటూ ఒకప్పటి బాల్య స్నేహితులు పలకరించుకున్నారు . తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి అధ్యాపకులు సీతారామయ్య, మద్దిలేటి, లూథరయ్య,నరసింహారెడ్డిలను ఘనంగా సన్మానించారు. అందరూ బాలలుగా మారి ఆనందోత్సాహాలతో తమ అమూల్యమైన సమయాన్ని కొద్ది గంటల పాటు గడిపారు. కరచాలనాలు, కౌగిలింతలతో తమ కలయికను పూర్తి కానివ్వక



చిన్నప్పటి అనుభవాలను నెమరు వేసుకుంటూ మనస్ఫూర్తిగా నవ్వుకున్నారు. ఎన్నో భావోద్వేగాల మధ్య తమకు దొరికిన ఆ కొద్ది మధుర క్షణాలను ఆనందంగా గడిపారు. ఏదో తెలియని ఆనందం, వింత అనుభూతుల మధ్య వారంతా కలిసి ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. మూడు దశాబ్దాల తరువాత తమ కళాశాలలోఆత్మీయ పలకరింపులతో మురిసిపోయారు.. తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఆప్యాయ పలకరింపులతో సరదాగా గడిపారు. కుటుంబ సభ్యులను ఒకరినొకరు పరిచయాలు చేసుకున్నారు. అనంతరం కళాశాలలో తమకు విద్య నేర్పిన అధ్యాపకులను ఘనంగా సన్మానించుకున్నారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేసి అనంతరం తమ జ్ఞాపకాలను, అనుభవాలను కుటుంబ సభ్యుల పరిచయాలతో తమకున్న కాలాన్ని గడిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజిక సత్య ప్రపూర్ణ, పూర్వ విద్యార్థులు ఖాసిం బాబు, స్వామి నాయక్ ,మోహన్ రెడ్డి ,కుద్దుస్, గుండా మురళి, సురేష్, శ్రీనివాసులు, సుబ్బమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ కార్యకర్తలు గా రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు యాదవ్.





రుద్రవరం.పల్లె వెలుగు: తెలుగుదేశం పార్టీ ఉత్తమ కార్యకర్తలుగా రుద్రవరం మండలం చిన్న కంబలూరు గ్రామానికి చెందిన జంగా రాజశేఖర్ రెడ్డి, ఎడవలి శ్రీనివాసులు ఎంపికయ్యారు. వీరికి తెలుగుదేశం పార్టీ నాయకుడు భార్గవ్ రామ్ నాయుడు చేతుల మీదుగా ఉత్తమ ప్రశంస పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలుగా ఎన్నికైన వీరిని టిడిపి నాయకులు జంగా పెద్ద పుల్లారెడ్డి, జంగా వెంకటేశ్వర రెడ్డి లతో పాటు గ్రామ నాయకులు కార్యకర్తలు అభినందించారు. ఉత్తమ కార్యకర్తలుగా తమను ఎన్నుకున్నందుకు తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు. ఉత్తమ కార్యకర్తలుగా తమను ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవ్ రామ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచ్చుల తొలగింపు పై అటవీ శాఖ అవగాహన

బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 4: వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా



అటవీశాఖ ఉచ్చుల తొలగింపు పై అవగాహన కార్యక్రమం చేపట్టింది. ఆదివారం నారపురెడ్డి కుంట సెక్షన్లో సిబ్బంది తోపాటు ప్రొటెక్షన్ వాచర్లు మంగలేటి కాలువ, గంగమ్మ గుడి ,కానుగ కూపే తో పాటు ఫ్రెండ్షిప్ గ్రామ సరిహద్దులలో ఉచ్చుల తొలగింపు డ్రైవ్ను నిర్వహించారు. గాలి చెన్నయ్యపాలెం సెక్షన్ లో సిబ్బంది ప్రొటెక్షన్ వాచర్లు నెమళ్ళకుంట చెంచుగూడెం ప్రాంతంలో ఉ చ్చుల తొలగింపు పై డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్రిడ్జ్ గ్రామాలైన చిన్నదేవులాపురం బరకల కాలనీలో నివసించే ప్రజలు గొర్రెల కాపలాదారులకు ఉచ్చుల తొలగింపు వన్యప్రాణుల సంరక్షణ ప్రాముఖ్యతపై ఆహ్వాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెల కాపలాదారుల చేత ప్రమాణం చేయించారు. ఉచ్చుల తొలగింపు డ్రైవ్ ద్వారా నిరోధించడంపై దృష్టి సారించడం జరిగిందని పేర్కొన్నారు. వన్యప్రాణుల సంరక్షణ పై అవగాహన కల్పించడంతోపాటు మానవ వన్యప్రాణుల సమన్వయాన్ని సాధించడాన్ని లక్ష్యంగా నిర్ణయించారు. వన్యప్రాణుల వేటను నిరోధించడం ,ఉచ్చుల వాడకంపై అవగాహన కల్పించడంలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ,మానవ వన్యప్రాణి సమన్వయాన్ని సాధించడాన్ని లక్ష్యాలుగా నిర్ణయించారు. ప్రాజెక్టు టైగర్ నంద్యాల అధికారి డాక్టర్ చైతన్య కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బండి ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝా ఆధ్వర్యంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు నాగరాజు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ం

## అహోబిలం శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న

### గంగమ్మ తల్లి పొంగలి ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 4 పల్లె వెలుగు, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజెంద్రా రెడ్డి









ఆదివారం అహోబిలం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దర్శించుకున్నారు అహోబిలం చేరుకున్న ఆయనకు అహోబిలం ఏవో రంగరాజు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఆలయ అర్చకులు పాల్గొని స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు అనంతరం అహోబిల గ్రామస్థులకు డోలి విరాళం చేశారు. అనంతరం అహోబిలం గ్రామం వై ఎస్ ఆర్ సి పి నాయకులు నాసారి వెంకటేశ్వర్లు ( సీసా ) ఆధ్వర్యంలో నిర్వహించిన గంగమ్మ తల్లి పొంగలి ఉత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహోబిలంలో వర్షాలు లేక పంటలు సరిగా లేక రైతులు చాలా నష్టపోవాల్సి వస్తుందన్నారు. వర్షాభావ పరిస్థితులను బట్టి అహోబిలంలో వర్షాలు బాగా కురువాలని గంగమ్మతల్లి పొంగలి ఉత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. ఆ గంగమ్మ తల్లి దయతో మంచిగా వర్షాలు కూరవాలని, రైతులు సుబిక్షంగా వుండాలని గంగమ్మ తల్లిని వేడుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం పి పి గజ్జల రాఘవేంద్రా రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ గంధం వీర రాఘవ రెడ్డి, కందుకూరు రాజగోపాల్ రెడ్డి అహోబిలం వైసీపీ నాయకులు నాసారి వెంకటేశ్వర్లు, స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రెండో జాతీయ కరాటే పోటీలు

రాజమహేంద్రవరం, అక్టోబర్ 04 పల్లె వెలుగు స్థానిక పేపర్ మిల్ ఎదురుగా ఉన్న శ్రీ కృష్ణ సాయి కళ్యాణమండపంలో నాగరాజు ఆధ్వర్యంలో రెండో జాతీయ కరాటే పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టి.కె. విశ్వేశ్వర రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి క్రీడాకారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి టి.కె. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ మూడు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొని పోటీలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. కరాటే కేవలం క్రీడ మాత్రమే కాదని, బాలికల్లో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించే అద్భుతమైన విద్య అని స్పష్టం చేశారు. ప్రతి పాఠశాల, కళాశాలలో బాలికలకు తప్పనిసరిగా సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ అందించాలని సూచించారు. ఏడు లక్షల జనాభా ఉన్న నగరంలో జాతీయ స్థాయి స్టేడియం లేకపోవడం బాధాకరమని, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్టేడియం ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. విపత్కర పరిస్థితుల్లో మహిళలు తమను తాము రక్షించుకునే సామర్థ్యం కరాటే ద్వారానే కలుగుతుందని, ఆడపిల్లలకు ఈ శిక్షణ ఎంతో అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో దర్యావతి, విక్రమ్, నమ్మగౌడ్, సత్య, పెట్ల రాజు తదితరులు స్వచ్ఛందంగా వాలంటీర్లుగా పాల్గొని విశేష సేవలందించారు. ఎలాంటి స్వార్థం లేకుండా కార్యక్రమానికి సహకరించిన వారికి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

# పీజీఆర్ఎస్ కేంద్రాల్లో క్యూఆర్ కోడ్‌ల సేవలు

అమలాపురం, అక్టోబర్ 04 పల్లె వెలుగు ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ సేవలపై






ప్రజల సంతృప్తిని తెలుసుకునేందుకు జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కేంద్రాల్లో పారదర్శకత పెంచేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. సమస్యలు పరిష్కరించడం ఎంత ముఖ్యమో, ఆ పరిష్కారం పట్ల ప్రజల స్పందన, అధికారుల తీరు తెలుసుకోవడం కూడా అంతే అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పరిపాలనలో అవసరమైన మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. అక్టోబర్ 5వ తేదీ సోమవారం జిల్లావ్యాప్తంగా పీజీఆర్ఎస్ (రెవెన్యూ క్లినిక్) కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్, మండల తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీలు స్వీకరిస్తామన్నారు. బాధితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారం పొందాలని, ప్రతి అర్జీ పరిష్కారంపై పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. పీజీఆర్ఎస్ కేంద్రాల్లో సేవలు పొందిన తర్వాత ప్రజలు అక్కడున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అధికారుల స్పందన, సమస్య పరిష్కార తీరుపై తమ అభిప్రాయాలను నమోదు చేయాలని కోరారు. ఈ ఫీడ్‌బ్యాక్ ద్వారా లోపాలను సరిదిద్ది, సేవలను మరింత మెరుగుపరుస్తామన్నారు. నేరుగా కేంద్రాలకు రాలేని వారు 1100 టోల్ ఫ్రీ నంబర్, మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని, అలాగే 9552300009 వాట్సాప్ నంబర్ ద్వారా 300కు పైగా పౌర సేవలు పొందవచ్చని కలెక్టర్ మహేష్ కుమార్ వివరించారు. కేవలం ఫిర్యాదుల పరిష్కారమే కాకుండా ప్రజల సంతృప్తే లక్ష్యంగా ఈ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన స్పష్టం చేశారు

# పేదల సేవకే ఏఎంజీ ఆర్గనైజేషన్ : చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం, అక్టోబర్ 04 పల్లె వెలుగు మానవ సేవే మాధవ సేవ అనే స్ఫూర్తితో పేద ప్రజలకు



అండగా ఉండేందుకు ఏర్పాటు చేసిన ఏఎంజీ కుమారి ఫౌండేషన్ (ఏఎంజీ ఆర్గనైజేషన్)ను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అడ్వకేట్ రాజ్ కుమార్ తన తల్లి మేరీ గ్రేస్ సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈ సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని జగ్గిరెడ్డి కొనియాడారు. గతంలో తన తండ్రి చిర్ల సోమసుందర్ తో ఆత్మీయ అనుబంధం కలిగిన మేరీ గ్రేస్ ప్రజా సేవలో తనదైన పాత్ర పోషించారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్ కు ఆయన ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపులో కార్డియాలజీ, న్యూరాలజీ, డయాబెటిస్, డెంటల్, ఆప్తమాలజీ తదితర విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళా సాధికారత, ఆరోగ్య సంరక్షణ, పిల్లల విద్య, సీనియర్ సిటిజన్లకు సహాయం, కమ్యూనిటీ వెల్ఫేర్, న్యాయ సలహాలు, ఉపాధి నైపుణ్యాల అభివృద్ధి, దివ్యాంగుల సంక్షేమం వంటి పలు రంగాల్లో సేవలు అందించాలనే లక్ష్యంతో ఏఎంజీ ఆర్గనైజేషన్ ముందుకు సాగడం పట్ల చిర్ల జగ్గిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ సంస్థ ద్వారా మరింత మంది పేదలకు మెరుగైన సేవలు అందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమంలో వైద్యులు, మదర్ థెరిస్సా ఫౌండేషన్ ప్రతినిధులు, పాస్టర్, నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.. సీఎంగా చంద్రబాబే రావాలన్న లబ్ధిదారులు

కొవ్వూరు, అక్టోబర్ 04 పల్లె వెలుగు అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తుందని



కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో 166 మంది లబ్ధిదారులకు రూ.82,14,283 విలువైన సాయాన్ని (162 మందికి చెక్కులు, నలుగురికి ఎల్ఓసీలు) ఆయన పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ అమలుతో పాటు కేవలం నియోజకవర్గంలోనే సుమారు రూ.10 కోట్ల సాయం అందించామన్నారు. గత ప్రభుత్వం ఏ ఒక్కరికైనా సాయం చేసిందా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులతో యువతకు ఉపాధి పెరుగుతోందన్నారు. చంద్రబాబు దేవుడితో సమానమని, 2029, 2034లో కూడా ఆయనే సీఎంగా గెలుపొందాలని లబ్ధిదారులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం, చాగల్లు, చంద్రవరం, చిక్కాల, దారవరం, కలవలపల్లి, మల్లవరం, మార్కొండపాడు, నెలటూరు, ఎస్.ముప్పవరం, ఊనగట్ల, కొవ్వూరు మండలం అరికిరేవుల, ధర్మవరం, ఐ.పంగిడి, కాపవరం, కుమారదేవం, మద్దూరు, వాడపల్లి, నందమూరు, పసివేదల, పెనకనమెట్ట, సీతంపేట, తోగుమ్మి, వేములూరు, తాళ్లపూడి మండలం అన్నదేవరపేట, గజ్జరం, మలకపల్లి, పెద్దేవం, పోచవరం, ప్రక్కిలంక, తాడిపూడి, తాళ్లపూడి, తిరుగుడుమెట్ట, వేగేశ్వరపురం గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు. అలాగే మద్దిపట్ల శివరామ కృష్ణ, టుమెన్ కమిటీ సభ్యులు కంతమణి రామకృష్ణ, ఏఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, జనసేన ఇంచార్జ్ టీ.వీ. రామారావు, మండలం మరియు టౌన్ కూటమి అధ్యక్షులు, పార్లమెంట్ కమిటీ మెంబర్స్, ఎన్డీఏ కూటమి నాయకులు, వేల సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు

# అడవులను కాపాడుకుందాం వన్య ప్రాణులను సంరక్షిద్దాం.

రుద్రవరం . పల్లె వెలుగు: అడవులను గ్రామంలో 72వ వన్యప్రాణి వారోత్సవాల




కాపాడుకుందాం వన్యప్రాణులను సంరక్షించుకుందాం అని రుద్రవరం రేంజి ఆఫీసర్ ముర్తుజావలి అన్నారు. ఆదివారం రుద్రవరం మండలంలోని హరినగరం గ్రామంలో వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఫారెస్ట్ అధికారి సి. చైతన్య కుమార్ రెడ్డి గారి ఆదేశాల మేరకు సబ్ డి ఎఫ్ ఓ శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో రుద్రవరం రేంజ్ నూతల సెక్షన్ పరిధిలోని హరి నగరం సందర్భంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు ఆవాసాల అనుసంధానం- వృద్ధి చెందుతున్న వన్యప్రాణులు అనే ఇతివృత్తంతో 72వ వన్యప్రాణి వారోత్సవాలు అక్టోబర్ 2 నుంచి 8 వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పెద్దలు సంజీవ రాయుడు వి ఎస్ ఎస్ చైర్‌పర్సన్ పి. సుబ్బరాయుడు సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. హరి నగరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వన్యప్రాణులపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా వన్యప్రాణి వారోత్సవాల ఉద్దేశ్యం, అడవులు మరియు వన్యప్రాణుల ప్రాముఖ్యత, వన్యప్రాణుల ఆవాసాల పరిరక్షణ ఆవశ్యకత గురించి గ్రామస్థులకు వివరించడం జరిగింది.

అనంతరం గ్రామస్థులతో కలిసి వన్యప్రాణి పరిరక్షణపై మానవహారం నిర్వహించి, వన్యప్రాణులను సంరక్షించేందుకు గ్రామస్థులతో కలిసి వన్యప్రాణి పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. తదుపరి, అడవుల్లో వన్యప్రాణులను పట్టుకోవడానికి ఏర్పాటు చేసే ఉచ్చులు, వలలు మరియు ఇతర అక్రమ వేట పద్ధతుల వల్ల కలిగే నష్టాలపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, అక్రమ వేటను నిరోధించడం మరియు వన్యప్రాణుల ఆవాసాలను కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు వి జేమ్స్ పాల్, పి మాబుఖాన్, టి రామకృష్ణ, జి శ్రీనివాసులు, బీటు ఆఫీసర్లు సురేంద్ర గౌడ్, నరసింహారెడ్డి, నాగ హుస్సేనయ్య, నగేష్, ఫాల్కన్ బేస్ క్యాంప్ పిడబ్ల్యూ ఎస్ గ్రామస్థులు పాల్గొన్నారు.

# అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి : బిసి రాజారెడ్డి

**● మా తండ్రి కీ. శే.బిసి గుర్రెడ్డి గారి జ్ఞాపకార్థం 2009 అక్టోబర్ లో ప్రారంభమైన పింఛన్ పంపిణీ కార్యక్రమం ● 18వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన అంధులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం ● 17 ఏళ్లుగా సొంత డబ్బులతో అందులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న బీసీ రాజారెడ్డి**

బనగానపల్లె, అక్టోబర్ 4,పల్లెవెలుగు అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బిసి గుర్రెడ్డి కాలనీలో అంధులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరికి రూ.700 చొప్పున 200 మందికి బిసి రాజారెడ్డి సొంత డబ్బులతో పింఛన్ పంపిణీ చేశారు. ముందుగా కీ.శే. బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతులకు, కీ.శే. బిసి బాలతిమ్మారెడ్డిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ.. మా తండ్రి కీ. శే.బిసి గుర్రెడ్డి గారి జ్ఞాపకార్థం 2009 అక్టోబర్ లో అంధులకు పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించామన్నారు. 17 ఏళ్లుగా ప్రతినెల ఒకటో తేదీనే సొంత డబ్బులతో వారికి పింఛన్ అందిస్తున్నామన్నారు. నేటితో పింఛన్ల పంపిణీ కార్యక్రమం 18 సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. ఇన్నేళ్లుగా అంధులకు ఆర్థిక సాయం అందిస్తూ తన వంతుగా చేయూతనివ్వడం భగవంతుడిచ్చిన వరంగా భావిస్తానన్నారు. అంధులంటే చిన్నచూపు చూడటం తగదన్నారు. అంధులు, దివ్యాంగుల పట్ల గౌరవంగా మెలగాలని సూచించారు. వారికి మంచి చేయకపోయినా పర్వాలేదు కానీ చెడు మాత్రం చేయకూడదన్నారు. నేటి సమాజంలో రోజురోజుకు మానవత విలువలు కనుమరుగవుతుండడం బాధ కలిగిస్తోందన్నారు. నేటి ఆధునిక యుగంలో అందరూ డబ్బు కోసం పరిగెడుతూ మానవ సంబంధాలకు దూరం అవుతున్నారన్నారు. అంధులకు ఎంతో మనోధైర్యం ఉంటుందని వారు ఆత్మవిశ్వాసంతో బ్రెయిని లిపిలో ఉన్నత విద్యను అభ్యసిస్తే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కడప జిల్లాకు చెందిన బూడిద శ్రీనివాసులు రెడ్డి, మహారాష్ట్ర ఉల్లాస నగరానికి చెందిన ప్రాంజల్ అనే మహిళ, తూర్పుగోదావరి జిల్లా గుండవల్లి గ్రామానికి



చెందిన కట్టా సింహాచలం లు అంధులైనప్పటికీ పట్టుదలతో ఉన్నత విద్యలు చదివి ఐఏఎస్ లు అయ్యారన్నారు. హైదరాబాద్ కు చెందిన బొల్లా శ్రీకాంత్ అంధుడని హైదరాబాదు ఐఐటి లో సీటు నిరాకరిస్తే అమెరికాలో సీటు సంపాదించి నేడు 400 కోట్ల వ్యాపార సామ్రాజ్యానికి అధిపతి అయ్యాడన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. మా తల్లిదండ్రులు కీ. శే. బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతులు మా అన్నదమ్ములను క్రమశిక్షణతో పెంచి మా భవిష్యత్తుకు మంచి బాటలు వేశారన్నారు. వారి రుణం తీర్చుకునేందుకు సేవా కార్యక్రమాలు చేయడం వల్ల నాకు ఎంతో ఆత్మ సంతృప్తి లభిస్తోందన్నారు. తాను అందిస్తున్న పింఛను తీసుకుంటున్న 6 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు వారు అందత్వం ఉందని బాధపడకుండా ఎంతో మనోధైర్యంతో ముందుకు సాగి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయం అన్నారు. రేవనూరు గ్రామానికి చెందిన కొడవటి సునీత, పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన ఎం శ్రీకాంత్, గూటుపల్లి గ్రామానికి చెందిన ఆర్ మధు సుధాకర్, ఆత్మకూరుకు చెందిన షేక్ షాకీర్, గాజులపల్లి కు చెందిన సహారా బి, కోటపాడుకు చెందిన ఉసేనమ్మ లు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. బనగానపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ... కుల మతాలకు , ప్రాంతాలకు అతీతంగా బిసి రాజారెడ్డి గారు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంటున్నారని కొనియాడారు. బనగానపల్లె పట్టణ సర్పంచ్ గా పనిచేసిన సమయంలో పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన ఘనత బిసి రాజారెడ్డికి దక్కుతుందన్నారు. మద్దిలేటి స్వామి క్షేత్రం, గోర్లగుట్ట సమీపంలో, గాజులపల్లె సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో , మీరాపురం వద్ద , బనగానపల్లె అయ్యప్ప స్వామి గుడి వద్ద సొంత డబ్బులతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసి ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణికుల దాహార్తి తీరుస్తున్నారని కొనియాడారు. బిసి కుటుంబంతో తమ కుటుంబానికి ఎంతో ఆత్మీయ అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. భగవద్గీత ప్రచారకులు గురూజీ రామశేషయ్య మాట్లాడుతూ... బిసి రాజారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు సమాజంలోని ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. బీసీ రాజారెడ్డి లాగా మరి కొంతమంది ఆలోచన చేస్తే సమాజాభివృద్ధికి దోహదం చేసిన వారు అవుతారన్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు పలువురికి స్ఫూర్తిని ఇవ్వాలన్నారు. అనంతరం బిసి రాజారెడ్డి అభిమానులు ఆయనకు జ్ఞాపకం అందజేసి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం అంధులకు , వారితో పాటు వచ్చిన సహాయకులకు భోజనం వసతి కల్పించి బిసి రాజారెడ్డి స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో బొబ్బల మహేశ్వర్ రెడ్డి , రోటరీ క్లబ్ మెంబర్ బలరామయ్య , భరతుడు పాల్గొన్నారు.

# శ్రీకాళికా మాత దేవస్థానంలో ఈనెల 11 నుండి దసరా ఉత్సవాలు

**ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసాచారి**

ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 4, పల్లె వెలుగు ఆళ్లగడ్డ పట్టణంలోని విశ్వరూప పారిశ్రామిక నగర్ లో శ్రీశ్రీశ్రీ కాళికామాత దేవస్థానము నందు ఈనెల 11వ తేదీ నుండి 21వ తేదీ వరకు శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని శ్రీకాళికా మాత దేవాలయం కమిటీ అధ్యక్షులు యద్దనపూడి శ్రీనివాసాచారి ఆహ్వాన పత్రికను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. 11వ తేదీ కలశస్థాపనతో ప్రారంభించి 16 వ తేదీన బిందె సేవ, 18 వ తేదీన దుర్గాష్టమి, 20వ తేదీ విజయదశమి రోజున గ్రామోత్సవం,21వ తేదీ వసంతోత్సవం మరియు అన్నప్రసాద వితరణతో ఉత్సవాలు ముగుస్తాయని, ఈ నవరాత్రులలో ప్రతిరోజూ సాయంకాలం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగునని అనంతరం అల్పాహారం ఏర్పాటు చేయబడినదని కావున భక్తులు ఈ నవరాత్రులలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీ కాళికామాత వారి అనుగ్రహానికి పాత్రులుకాగలరని దేవస్థాన కమిటీ అధ్యక్షులు యద్దనపూడి శ్రీనివాసచార్యులు మరియు ఉపాధ్యక్షులు ముత్తలూరు సురేష్ ఆచార్యులు తెలియజేశారు.. ఈ కార్యక్రమం నందు కమిటీ గౌరవాధ్యక్షులు కోటేశ్వరరావు ఆచార్యులు, పెద్ద సుబ్బయ్య ఆచార్యులు, చిన్న పుల్లయ్య ఆచార్యులు, ప్రధాన కార్యదర్శి



యాడికి గోపాలచార్యులు, క్యాషియర్ రామ్మోహన్ ఆచార్యులు, గుండ్లకుంట సుబ్బయ్య ఆచార్యులు, సుబ్రహ్మణ్యం ఆచార్యులు, దేవస్థాన పురోహితులు చంద్రశేఖర ఆచార్యులు, వెంకటేశ్వర ఆచార్యులు, పురుషోత్తమాచార్యులు, దేవ పూజ హరికృష్ణ ఆచార్యులు, మరియు దేవస్థాన మహిళా కమిటీ అధ్యక్షురాలు కమ్మరి విశాలక్ష్మి , ఉపాధ్యక్షురాలు పన్నీరు పుల్లమ్మ, ప్రధాన కార్యదర్శి హరీషా దేవి, సభ్యురాలు ఉదయభాను, సావిత్రమ్మ ,శ్రీదేవి, జమీల మొదలగువారు పాల్గొన్నారు

# రాజంపాలెం-దొండపూడి రహదారిపై మురుగునీటి సమస్య..

### పాఠశాల వద్ద తక్షణమే స్పీడ్ బ్రేకర్లు, ఏర్పాటు చేయాలి






రాజంపాలెం, అక్టోబర్ 04 పల్లె వెలుగు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం రాజంపాలెం, దొండపూడి గ్రామాల మధ్య డ్రైనేజీ సమస్య స్థానికులకు నరకయాతనగా మారింది. సరైన వ్యవస్థ లేక మురుగు, వర్షపు నీరు రహదారిపై పొంగిపొర్లుతూ ఇళ్లు, వ్యాపార సముదాయాల్లోకి చేరుతోంది. నివాసాల్లోకి విషపురుగులు వస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కలుషిత నీటితో అనారోగ్యం పాలవుతున్నారు. దొండపూడి నుంచి రాజంపాలెం వైపు వస్తున్న ఈ నీటితో పాదచారులకు కష్టాలు తప్పడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాజంపాలెం గ్రామంలో రహదారి పక్కనే ఉన్న హైస్కూల్ విద్యార్థుల భద్రత ప్రమాదంలో పడింది. పాఠశాల సమయాల్లో రోడ్డుపై వాహనాలు అతివేగంగా వెళ్తుండటం, అక్కడ ప్రమాదకరమైన మలుపు ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. విద్యార్థుల భద్రత కోసం పాఠశాల వద్ద తక్షణమే స్పీడ్ బ్రేకర్లు, మలుపు వద్ద డివైడర్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి సమస్యను పరిష్కరించాలి. స్థానిక శాసనసభ్యులు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే స్పందించాలని రాజంపాలెం, దొండపూడి ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యానికి స్వస్తి పలికి సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు

# నిందితుడిని కఠినంగా శిక్షించాలని నిరసన



తాళ్లపూడి, అక్టోబర్ 04 పల్లె వెలుగు దారుణ హత్యకు గురైన మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కొత్త పట్టిసీమ గ్రామస్తులు భారీ ఆందోళన చేపట్టారు. బంగారం కోసం ఓ మహిళను దారుణంగా హత్య చేసి గోదావరి నదిలో పడేశారన్న ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తాడిపూడి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఏకాబు ఈ అమానుషానికి పాల్పడ్డాడని, మహిళను హత్య చేసిన నిందితుడిని వెంటనే ఉరితీయాలని గ్రామస్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని, నిందితుడికి కఠిన శిక్ష విధించాలని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు.
పట్టిసీమ గ్రామస్తుల ఆందోళనకు భారతీయ జనతా పార్టీ నాయకులు పూర్తి మద్దతు ప్రకటించి బాసటగా నిలిచారు. తూర్పుగోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, తాళ్లపూడి మండల బీజేపీ అధ్యక్షులు ఇందుగుల రామకృష్ణ, రాష్ట్ర బీజేపీ కార్యదర్శి పిల్లలమర్రి మురళీకృష్ణ, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు తాడిమల్ల విజయవాణి వందలాది మంది పార్టీ కార్యకర్తలతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. నిందితుడికి ఉరిశిక్ష పడేలా చూసే వరకు గ్రామస్తులకు అండగా ఉంటామని బీజేపీ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మరోవైపు, హత్యకు గురైన మహిళ మృతదేహం కోసం గోదావరి నదిలో గత ఐదు రోజులుగా ముమ్మర గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పోలీసు శాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ల సహాయంతో నదిలో విస్తృతంగా వెతుకుతున్నారు

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో కొవ్వూరు ఆసుపత్రికి ప్రథమ స్థానం




కొవ్వూరు, అక్టోబర్ 04 (పల్లె వెలుగు తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో కొవ్వూరు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) సరికొత్త రికార్డు సృష్టించింది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు 2026లో భాగంగా జిల్లా స్థాయిలో కొవ్వూరు ఆసుపత్రి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. అక్టోబర్ 2వ తేదీన నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా ఆసుపత్రి యాజమాన్యం ఈ పురస్కారాన్ని అందుకుంది. ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, స్వచ్ఛతను పకడ్బందీగా పాటించడంలో కనబరిచిన అద్భుతమైన పనితీరుకు గుర్తింపుగా ఈ అవార్డు వరించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ అవార్డు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పరిపాలనా విభాగానికి బాధ్యత వహిస్తున్న నీరజ్ అంకితభావాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది అంతా సమయపాలన పాటిస్తూ, ముందుచూపుతో రోగులకు అత్యుత్తమ సేవలు అందించడం వల్లే ఈ ఘనత సాధ్యమైందని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ సిబ్బంది అంతా ఇదే స్ఫూర్తితో నిరంతరం పనిచేసి, వచ్చే ఏడాది కూడా ఈ అవార్డును కొవ్వూరు ఆసుపత్రికి దక్కేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు

# ధ్రువపత్రాల జారీలో డిజిటల్ కష్టాలు




కాత్రేనికొన, అక్టోబర్ 04పల్లె వెలుగు ప్రభుత్వ సేవలను డిజిటల్ విధానంలోకి మార్చే క్రమంలో సామాన్య ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'మన మిత్ర' ద్వారా కుల, ఆదాయ ధ్రువపత్రాలను కేవలం ఆన్‌లైన్‌లో జారీ చేస్తుండటంతో స్మార్ట్‌ఫోన్, వాట్సాప్ సౌకర్యం లేని పేదలు, వృద్ధులు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. సర్టిఫికెట్లను కేవలం డిజిటల్ కాపీ రూపంలో మాత్రమే ఇస్తుండటంతో, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై కనీస అవగాహన లేని వారు ధ్రువపత్రాలు ఎలా పొందాలో తెలియక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరానికి సంబంధించి లా సెట్, పీజీ సెట్ వంటి పలు ప్రవేశ పరీక్షలు, ఇతర విద్యా అవసరాలకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు అత్యంత కీలకంగా మారాయి. కేవలం మొబైల్ ద్వారానే వీటిని పొందాలనే నిబంధనతో విద్యార్థులు సకాలంలో సర్టిఫికెట్లు పొందలేక ఉన్నత చదువులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందరికీ అందుబాటులో లేని ప్రస్తుత తరుణంలో పూర్తిగా డిజిటల్ విధానంపైనే ఆధారపడటం గ్రామీణ ప్రాంతాల్లో ఆచరణ సాధ్యం కావడం లేదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో స్మార్ట్‌ఫోన్ లేని వారి అవసరాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. 'మన మిత్ర'తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల ద్వారా కూడా కుల, ఆదాయ ధ్రువపత్రాల ప్రింటెడ్ కాపీలను అందించే వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్టిఫైడ్ కాపీలు ఇచ్చేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు

# ప్రైవేట్ ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం



రాజమహేంద్రవరం, అక్టోబర్ 04 పల్లె వెలుగు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని అప్పుస్మా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పి. కళ్యాణ్ రెడ్డి, కార్యదర్శి పి. రామకృష్ణ రాజు అన్నారు. ఆదివారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ కళ్యాణమండపంలో
గురుపూజోత్సవం-2026
సందర్భంగా జిల్లా స్థాయి సన్మాన సభ నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం సవాళ్లను అధిగమించి శ్రమిస్తున్న ఉపాధ్యాయులను, 35 ఏళ్లుగా విశేష సేవలు అందిస్తున్న ప్రైవేట్ సంస్థలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, డెప్యూటీ ఈఓ తులసిదాస్, అప్పుస్మా రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ శర్మ, విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సభలో అప్పుస్మా నేతలు ఎన్. భాస్కరరామయ్య, పి. సురేష్, ఎన్. తిరుమలరావు, చ. వెంకటేశ్వరరావు, పి. శివాజీ, పి.వి.ఎస్. ప్రసాద్, ఎ.ఎన్.వి. రమేష్, ఎ. సుధీర్ కుమార్, బి. సత్యనారాయణ, వి. నెల్సన్ ఆంటోని, బి. రవి బాబు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ నుంచి టి. నాగరత్నం, ఎస్. మురళీధర్, బి. హరినాథ్, రూరల్ నుంచి ఎ. రమేష్, ఎ. రవీంద్ర, జి. రామకృష్ణ, రాజానగరం నుంచి కన్నబాబు, నాగేశ్వరరావు, వీరబాబు, అనపర్తి నుంచి పి.వి.ఎస్. ప్రసాద్, ఎస్. నాగేంద్ర కుమార్, జి.వి. రమణ, కొవ్వూరు నుంచి వి.వి. అనీష్, వెంకటరత్నం, ఎన్. తిమోతి ఎస్. బాబు, గోపాలపురం నుంచి ఆర్. ఫణికిషోర్, జి. సీతారామిరెడ్డి, కె. శ్రీనివాస్, నిడదవోలు నుంచి పి. కేశవమూర్తి, ఎన్. వరప్రసాద్, కె. శ్రీనివాస్ తో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరయ్యారు

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



కొవ్వూరు, అక్టోబర్ 04 పల్లె వెలుగు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కొవ్వూరులోని స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆసుపత్రుల్లో కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రస్తుతం ఉన్న గదుల వివరాలు, అందుబాటులో ఉన్న అధునాతన వైద్య పరికరాలు, కల్పించాల్సిన ఇతర మౌలిక సదుపాయాల గురించి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యుత్తమ వైద్యం అందించేందుకు ఆసుపత్రుల్లో తక్షణమే అవసరమైన వసతులు, ఇతర సౌకర్యాలు, సిబ్బంది వివరాలతో సమగ్రమైన నివేదికను తయారు చేసి అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సంధ్య, డాక్టర్ ధర్మరాజు, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ సతీష్, డాక్టర్ సాంబశివరావు, సీహెచ్‌ఓ కృష్ణుడు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## తూకాల మోసంపై.. తూనికలు, కొలతల శాఖ చర్యలు ఏవి...?



కొవ్వూరు, అక్టోబర్ 04 పల్లె వెలుగు తూనికలు, కొలతల శాఖ అధికారుల పర్యవేక్షణ కరువవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. కూరగాయలు, కిరాణా, బంగారం, ఇనుము దుకాణాల వరకు ప్రతి చోటా తూకాల్లో భారీగా మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడ అసలు తూనికలు, కొలతల శాఖ ఉందో లేదో తెలియని దయనీయ పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో నియోజకవర్గ వ్యాప్తంగా వినియోగదారులు నిత్యం తీవ్రంగా నష్టపోతున్నారు. కిలో సరుకు కొనుగోలు చేస్తే కాటాలో కేవలం 900 గ్రాములు మాత్రమే వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. అధునాతన కంప్యూటర్ కాటాలను సైతం కిలోకు వంద గ్రాముల మేర వ్యత్యాసం వచ్చేలా వ్యాపారులు ముందుగానే సెట్ చేసి ప్రజలను నిలువునా దోచుకుంటున్నారు. ఎంతో పకడ్బందీగా జరగాల్సిన అధికారుల తనిఖీలు మచ్చుకైనా జరగకపోవడం పట్ల సర్వత్రా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో తాత్కాలిక పర్యవేక్షణకు మాత్రమే పరిమితం కాకుండా పర్మినెంట్ సిబ్బందిని నియమించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వ్యాపార సంస్థల్లో ప్రతిరోజూ ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి, తూకాల్లో మోసాలకు పాల్పడే వారిపై కఠిన శిక్షలు అమలు చేయాలని కొవ్వూరు నియోజకవర్గ ప్రజలు అధికారులను కోరుతున్నారు

# కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్



కొవ్వూరు, అక్టోబర్ 04 (పల్లె వెలుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం స్థానిక శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి తమ సమస్యలను వివరిస్తూ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో 'సేవా మేరా యోగ్ దాస్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం



ఆలమూరు, అక్టోబర్ 04 పల్లె వెలుగు పెనికేరులో రూ.47 లక్షల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం నిర్వహించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రతి గ్రామంలోనూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలియజేశారు. ఆదివారం ఆలమూరు మండలం పెనికేరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేసి, పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఓఎన్జిసి సిఆర్సి నిధులు రూ.14 లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, మండల ప్రజా పరిషత్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన రోడ్డును కూడా ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు

## శ్రీ బ్రహ్మానందీశ్వర స్వామి ఆలయ సంప్రోక్షణ ఆహ్వాన పత్రం అందజేత

నంద్యాల, అక్టోబర్‌పల్లె వెలుగు 4 నంద్యాల పట్టణంలోని కోటవీధిలో వెలసియున్న శ్రీ బ్రహ్మానందీశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 11న నిర్వహించనున్న ఆలయ సంప్రోక్షణ మరియు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు ఆలయ కమిటీ చైర్మన్ బోయ రామకృష్ణ మరియు సభ్యులు నంద్యాలలోని క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రోచ్ఛారణలతో మంత్రికి వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు ప్రదాన చేయగా, ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం 4:00 గంటల నుండి గోపూజ, గణపతి పూజ, రుద్ర హోమములతో ప్రారంభమై ఉదయం 11:00 గంటలకు పూర్ణాహుతి, మహామంగళహారతి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయ రామకృష్ణ, కమిటీ సభ్యులు మోహన్ గుప్త, శిరీష, రాధాకృష్ణ శర్మ, సురేష్ శర్మ, మురళీకృష్ణ శర్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com